కేటీఆర్‌కు టైకాన్-24 ఆహ్వాన పత్రికను అందజేస్తున్న టై గ్లోబల్ బోర్డ్ ట్రస్టీ వైస్ చైర్మన్ మురళీ బుక్కపట్నం, బీఆర్ఎస్ ఎన్నారై సెల్ గ్లోబల్ కో-ఆర్డినేటర్ మహేశ్ బిగాల

'టైకాన్ కేరళ'కు కేటీఆర్‌కు ఆహ్వానం

- తెలంగాణ అభివృద్ధి వ్యూహాలు ఔత్సాహికులకు స్ఫూర్తినిస్తాయి
- టై కేరళ అధ్యక్షుడు జాకబ్ జోయ్

హైదరాబాద్, నవంబర్ 17 (నమస్తే తెలంగాణ) : కేరళ రాష్ట్రంలోనే అతిపెద్ద ఈవెంట్‌గా పేరున్న 'ది ఇండస్ అంత్రప్రెన్యూర్స్' ఆధ్వర్యంలో నిర్వహించే ప్రతిష్ఠాత్మక టైకాన్ సదస్సుకు హాజరు కావాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఆహ్వానం అందింది. వచ్చే నెల 4, 5 తేదీల్లో కొచ్చిన్‌లోని గ్రాండ్ హయత్‌లో జరిగే ఈ సదస్సుకు ఆయనను గెస్ట్ ఆఫ్ హానర్‌గా ఆహ్వానించారు. వివిధ రంగాల సీఈవోలు, స్టార్టప్ వ్యవస్థాపకులు, పరిశ్రమల నిపుణులు దేశ, విదేశాల నుంచి సదస్సుకు హాజరుకానున్నారు. ఈ ఏడాది 'మిషన్ 2030 – ట్రాన్స్‌ఫార్మింగ్ కేరళ' థీమ్‌తో కేరళ ఆర్థిక వ్యవస్థను ఆధునికరించేందుకు అవసరమైన ప్రణాళికలు, వ్యూహాలపై ఈ సదస్సులో చర్చించనున్నారు. డిసెంబర్ 5న సాయంత్రం జరిగే టైకాన్ అవార్డ్స్, ముగింపు వేడుకలకు కేటీఆర్‌ను ప్రత్యేకంగా ఆహ్వానించారు. తెలంగాణ అభివృద్ధిలో కేటీఆర్ చూపిన చొరవ, నాయకత్వం, ఆవిష్కరణలు, అంత్రప్రెన్యూర్‌షిప్‌లను పెంపొందించడంలో ఆయన చేపట్టిన కార్యక్రమాలు, అనుసరించిన వ్యూహాలు సదస్సులో పాల్గొనే వారికి స్ఫూర్తిని కలిగిస్తాయని, కేటీఆర్ రాక ద్వారా ఈ సమావేశానికి మరింత ప్రాధాన్యం సంతరించుకుంటుందని, యువ అంత్రప్రెన్యూర్స్‌కు ప్రేరణ కలిగిస్తుందని టై కేరళ అధ్యక్షుడు జాకబ్ జోయ్, టైకాన్ కేరళ-2024 చైర్మన్ వివేక్ కృష్ణ గోవింద్ అభిప్రాయపడ్డారు. టైకాన్ 24 ఆహ్వాన పత్రికను టై గ్లోబల్ బోర్డ్ ట్రస్టీ వైస్ చైర్మన్ మురళీ బుక్కపట్నం, బీఆర్ఎస్ ఎన్నారై సెల్ గ్లోబల్ కో-ఆర్డినేటర్ మహేశ్ బిగాలతో కలిసి ఆదివారం కేటీఆర్‌కు అందజేశారు.

ఢిల్లీకి కేటీఆర్

- లగచర్ల బాధితులకు అండగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్
- వారితో కలిసి ఎన్‌హెచ్ఆర్సీ, ఎస్సీ, ఎస్టీ, ఉమెన్ కమిషన్లకు ఫిర్యాదు

హైదరాబాద్, నవంబర్ 17 (నమస్తే తెలంగాణ) : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఆదివారం రాత్రి ఢిల్లీకి బయల్దేరి వెళ్లారు. ఇప్పటికే అక్కడికి చేరుకున్న మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్, లగచర్ల బాధితులతో కలిసి సోమవారం ఉదయం జాతీయ మానవహక్కుల కమిషన్, ఎస్సీ, ఎస్టీ కమిషన్, ఉమెన్ రైట్స్ కమిషన్ చైర్మన్లను కలిసి లగచర్ల ఘటనపై ఫిర్యాదు చేయనున్నారు. అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో మీడియాతో మాట్లాడనున్నారు. లగచర్ల ఘటనపై ఉదాసీనంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డిల వైఖరిని ఎండగట్టనున్నారు.

మర్రి జనార్దన్‌రెడ్డి కుమారుడి వివాహ వేడుకలో కేటీఆర్

నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి కుమారుడి వివాహం ఆదివారం హెచ్‌ఐఐసీలో వైభవంగా జరిగింది. ఈ వేడుకకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దంపతులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఎందరి ప్రాణాలు పోవాలె?

- 11 నెలల్లో 42 మంది చనిపోయిండ్రు
- గురుకులాల్లో మృత్యుఘోష వినిపించడం లేదా?
- పిల్లలు చనిపోతున్నా కాంగ్రెస్ సర్కారు మొద్దునిద్ర
- వరుసగా ఫుడ్ పాయిజన్లు, ఆత్మహత్యలు
- ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఇది నిదర్శనం కాదా?
- మృతుల కుటుంబాలకు 10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి
- హరీశ్‌రావు డిమాండ్

హైదరాబాద్, నవంబర్ 17 (నమస్తే తెలంగాణ) : 'ముఖ్యమంత్రి గారూ.. ఇంకెంతమంది చిన్నారులు ప్రాణాలు కోల్పోవాలె.. ఇంకెప్పుడు మీ కార్యాచరణ మొదలుపెట్టి విద్యార్థులను కాపాడుతరు?' అని మాజీ మంత్రి హరీశ్‌రావు నిలదీశారు. విద్యార్థుల మరణాలకు ప్రభుత్వమే బాధ్యత వహించి, వారి కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, నిర్లక్ష్యం వీడి, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ ఆదివారం ఎక్స్ వేదికగా డిమాండ్ చేశారు. చనిపోయిన విద్యార్థుల వివరాలను కూడా జత చేశారు. 'గురుకులాల్లో ఫుడ్ పాయిజన్లు, ఆత్మహత్యలతో విద్యార్థులు వరుసగా ప్రాణాలు కోల్పోతున్నా, ప్రభుత్వం మొద్దునిద్ర వీడకపోవడం సిగ్గుచేటు' అని మండిపడ్డారు. ముఖ్యమంత్రి మాటలు కోటలు దాటుతున్నాయని, చేతలు మాత్రం గడప దాటడం లేదని విమర్శించారు. గురుకులాల భోజనంలో నాణ్యత లేకుంటే జైలుకే అని బాలల దినోత్సవంనాడు సీఎం ప్రగల్భాలు పలకడం తప్ప, ఎలాంటి కార్యాచరణకు దిక్కు లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. సంగారెడ్డి జిల్లా బీసీ బాలికల గురుకుల పాఠశాలలో నిన్న మరో విద్యార్థిని ఆత్మహత్య చేసుకోవడం కలచివేసిందని, ఎంతో భవిష్యత్తు కలిగిన విద్యార్థులు అర్ధాంతరంగా ప్రాణాలు కోల్పోతుంటే, వారిని కాపాడాల్సిన ప్రభుత్వం చోద్యం చూడటం శోచనీయమని వాపోయారు.

> గురుకులాల్లో విద్యార్థుల మరణ మృదంగం మోగుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం మొద్దునిద్రపోతున్నది. 11 నెలల రేవంత్‌రెడ్డి పాలనలో ఒక్కరు కాదు.. ఇద్దరు కాదు.. ఏకంగా 42 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోవడం బాధ కలిగిస్తున్నది. కొందరు విషతుల్యమైన ఆహారానికి బలైతే.. మరికొందరు బలవన్మరణానికి పాల్పడ్డరు. కేవలం 11 నెలల్లోనే ఇంత మంది విద్యార్థులు మృత్యువాత పడటం కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం కాదా? - హరీశ్‌రావు

ముమ్మాటికీ ప్రభుత్వ హత్యలే

విద్యార్థుల చావులు ముమ్మాటికీ ప్రభుత్వ హత్యలేనని, దీనికి సీఎం రేవంత్‌రెడ్డి బాధ్యత వహించాలని హరీశ్ డిమాండ్ చేశారు. ప్రతిష్ఠాత్మకమైన బాసర ట్రిపుల్ ఐటీలోనూ ఇదే దుస్థితి కొనసాగడం దురదృష్టకరమని వాపోయారు. ఘనత వహించిన కాంగ్రెస్ పాలనలో ముగ్గురు ట్రిపుల్ ఐటీ విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారని గుర్తుచేశారు.

నరకకూపాలుగా మారినయ్

'బీఆర్ఎస్ పాలనలో దేశానికి రోల్ మాడల్‌గా నిలిచిన గురుకులాలు, కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో రోజురోజుకూ దిగజారి పోతుండటం బాధాకరం. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే గురుకులాలు నరకకూపాలుగా మారినయ్. విద్యాశాఖతోపాటు సంక్షేమం, గిరిజన, మైనార్టీ శాఖల నిర్వహణలో ముఖ్యమంత్రి నిర్లక్ష్యం అభంశుభం తెలియని విద్యార్థుల పాలిట శాపంగా మారింది. స్వయంగా ముఖ్యమంత్రి నిర్వహించే శాఖల పరిస్థితే ఇలా ఉంటే, ఇక మిగతా శాఖల పనితీరు గురించి చెప్పాల్సిన పనిలేదు' అని హరీశ్ నిప్పులు చెరిగారు.

మద్దతు ధరకే దిక్కు లేదు.. భరోసా ఎక్కడిది?

రాష్ట్రంలోని కౌలు రైతుల కష్టాలను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని హరీశ్ విమర్శించారు. ఆరుగాలం కష్టపడి పండించిన పత్తి పంటలకు మద్దతు ధర కూడా దక్కడం లేదని దుయ్యబట్టారు. 'కౌలు రైతులకు రైతు భరోసా దేవుడెరుగు. వారు పండించిన పత్తిని మద్దతు ధరకు కూడా అమ్ముకోలేని దుస్థితి కౌలు రైతులది' అని వాపోయారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణం పత్తి పండించిన కౌలు రైతుల సమస్యలకు పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. పత్తి కౌలు రైతులను పట్టించుకోవడం లేదని వచ్చిన వార్త క్లిప్పింగ్‌ను ఆయన ఎక్స్‌లో జత చేశారు.

> వాంకిడిలో గురుకులంలో పాఠాలు వినాల్సిన విద్యార్థిని 17 రోజులుగా నిమ్స్‌లో వెంటిలేటర్‌పై కొట్టుమిట్టాడుతున్నది. దీనికి కారణమెవరు? ఉన్నత స్థాయికి చేరుకొని తల్లిదండ్రుల కలను సాకారం చేయాలనుకున్న బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థిని బలవన్మరణానికి కారణమెవరు? సంగారెడ్డి బీసీ గురుకులంలో ఎంతో భవిష్యత్తు ఉన్న చిన్నారి ఆత్మహత్యకు కారణమెవరు? గురుకులాల్లో 11 నెలల్లో సగటున నెలకు ముగ్గురు ప్రాణాలు కోల్పోతున్నరు.. ఇందుకు కారణమెవరు? - హరీశ్‌రావు

'రాజ్యాంగం'లోనే బీసీలకు అన్యాయం

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య

కాచిగూడ, నవంబర్ 17: రాజ్యంగ రచన సమయంలో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని, దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 యేండ్లు గడిచిన ప్పటికీ బీసీలకు విద్యా, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాల్లో అన్యాయమే జరుగుతున్నదని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, మాజీ రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ ఆధ్వర్యంలో కాచిగూడలోని అభినందన్ హోటల్‌లో బీసీ సంఘాలు, కుల సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఆర్ కృష్ణయ్య, మాజీ ఎంపీ వీ హనుమంతరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ.. బీసీల ఉద్యమాన్ని పటిష్టపర్చేందుకు ఈ నెల 25న రవీంద్రభారతిలో 'బీసీల సమరభేరి' నిర్వహించనున్నట్టు తెలిపారు. వీ హన్మంతరావు మాట్లాడుతూ.. కేంద్రం పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టి బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నీలం వెంకటేశ్, నందగోపాల్, సుధాకర్, రామకృష్ణ, రమేశ్, ఉదయ్, జయంతి, వీరన్న, రాందేవ్, రఘుపతి, పరశురాం, రవి పాల్గొన్నారు.

జనగణనలో కులగణన చేపట్టాలి

హైదరాబాద్, నవంబర్17 (నమస్తే తెలంగాణ): కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన జనగణనలోనే కులగణన కూడా చేపట్టాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. బీసీలకు రిజర్వేషన్ల సాధన లక్ష్యంగా 25న హైదరాబాద్ రవీంద్రభారతిలో 'బీసీల సమరభేరి' నిర్వహించనున్నామని తెలిపారు. సంఘం కోర్ కమిటీ ఆధ్వర్యంలో సమరభేరి వాల్‌పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించి మాట్లాడారు. ఒకే రోజులో ఈడబ్ల్యూఎస్‌కు 10 శాతం రిజర్వేషన్లు కల్పించిన బీజేపీ సర్కారు బీసీలు ఏండ్లుగా పోరాడుతున్నా పట్టించుకోవడంలేదని విమర్శించారు.

పుట్ట మధు హత్యకు కుట్ర

- మంత్రి శ్రీధర్, శ్రీనుబాబు కలిసి నా చేతనే హత్య చేయించాలని చూశారు
- వారి సూచనల మేరకు హత్య చేసేందుకు వెళ్తుండగా మా వాహనాలకు యాక్సిడెంట్
- సోషల్‌మీడియాలో బీజేపీ నేత చల్లా నారాయణరెడ్డి వీడియో వైరల్

మహదేవపూర్ ఎస్సైకి ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

చల్లా నారాయణరెడ్డి

జయశంకర్ భూపాలపల్లి/పెద్దపల్లి, నవంబర్ 17(నమస్తే తెలంగాణ): మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధును తన ద్వారా హత్య చేయించేందుకు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు గతంలో కుట్ర చేశారని బీజేపీ నేత చల్లా నారాయణరెడ్డి ఆరోపించడం సంచలనం సృష్టించింది. 'మంథని మాజీ ఎమ్మెల్యే, పెద్దపల్లి జడ్పీ మాజీ చైర్మన్ పుట్ట మధును హత్య చేయాలని దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, అతని తమ్ముడు శ్రీనుబాబు నాతోనే ప్లాన్ చేయించారు. పుట్ట మధును చంపడం నీవళ్లే అవుద్దని చెప్పారు. వాళ్ల మాటలు విని రంగంలోకి దిగాను. మార్గ మధ్యలో నా మనసు మారింది. వెనక్కి వచ్చాం. నా రాజకీయ జీవితానికి ముగింపు పలికే ప్లాన్ చేశారని అర్థమైంది' అంటూ బీజేపీ నేత చల్లా నారాయణరెడ్డి చేసిన వ్యాఖ్యలు సోషల్‌మీడియాలో వైరల్ అవుతున్నాయి. గతంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు అనుచరుడిగా, మంథని నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ కీలకనేతగా వ్యవహరించిన నారాయణరెడ్డి అనంతర కాలంలో బీఆర్ఎస్‌లో చేరారు. మంథని టికెట్ దక్కకపోవడంతో బీఎస్పీలోకి, అనంతరం బీజేపీలోకి వెళ్లారు. తాజాగా శ్రీధర్‌బాబును ఉద్దేశించి ఆయన చేసిన వ్యాఖ్యలు కలకలం సృష్టిస్తున్నాయి. 'మీతో 14 ఏండ్లు కలిసున్నప్పుడు, మీరు ప్రభుత్వ విప్‌గా ఉన్నప్పుడు.. పుట్ట మధు నిన్ను ఇబ్బంది పెడితే.. మీ మెప్పు కోసం నేను, కొంతమందిమి కలిసి పుట్ట మధును కొట్టాం. అప్పుడు నాతో మీరు మంచిగా మాట్లాడారు. పక్కన కూర్చోబెట్టుకుని టీ తాగించారు' అని నారాయణరెడ్డి పేర్కొన్నారు. 'నీకు పుట్టమధు కంట్లో నలుసులా మారినప్పుడు మనిద్దరం కారులో వెళ్తుండగా, మంథని గుట్టలు ఎక్కేటప్పుడు మధును ఏదో ఒకటి చెయ్.. ఏమైనా నేను చూసుకుంటా అన్నావ్.. శ్రీను బాబు సైతం నువ్వే హీరోవు.. వాన్ని ఏదో ఒకటి చేసే సత్తా నీకే ఉంది అన్నాడు.. అనంతరం పుట్ట మధు కనుకునూరుకు వెళున్నట్టు సమాచారం ఇచ్చాడు.. అప్పుడు నేను స్కూల్ వ్యాన్‌లో 40 మందిని తీసుకుని, 20 మోటర్ సైకిళ్లు, నాలుగు కార్లలో వెళ్తుండగా పోతువాయి సమీపంలో స్పీడ్ బ్రేకర్ దగ్గర కార్లు ఢీ కొన్నాయి.. అప్పుడు ఎందుకో నాకు జ్ఞానోదయం అయింది.. కావాలని నన్ను కేసులో ఇరికించే ప్లాన్ చేస్తున్నారు.. నా రాజకీయ జీవితం నాశనం చేసే ప్లాన్ చేస్తున్నారని తెలుసుకుని వెనుదిరిగాను' అని నారాయణరెడ్డి వివరించారు. 'ప్రశ్నిస్తే ఒక వ్యక్తిని నరికి చంపిస్తడు.. ఒక వ్యక్తినేమో లాగి చంపిస్తడు.. శ్రీధర్‌బాబు ఇకనైనా ఈ కల్చర్ ఆపు.. ఆపకుంటే నేనూ నేషనల్ పార్టీలో ఉన్నా.. మాకూ కార్యకర్తలు ఉన్నారు.. ఎవరిని విమర్శించినా ఊరుకోం' అని హెచ్చరించారు. శ్రీధర్ బాబుపై నారాయణరెడ్డి వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. ఈ వీడియోపై చల్లా నారాయణరెడ్డిని 'నమస్తే తెలంగాణ' వివరణ కోరగా, ఆ వీడియో పూర్తిగా తాను మాట్లాడిందేనని, అందులో ఎలాంటి కల్పితాలు లేవని, పూర్తిగా వాస్తవాలని వివరించారు.

నారాయణరెడ్డిపై స్టేషన్‌లో ఫిర్యాదు

మహదేవపూర్: బీజేపీ నాయకుడు, కాటారం పీఏసీఎస్ మాజీ చైర్మన్ చల్లా నారాయణరెడ్డిపై కాంగ్రెస్ మహదేవపూర్ మండల అధ్యక్షుడు అక్బర్‌ఖాన్ పార్టీ నాయకులతో కలిసి ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సోషల్‌మీడియా, యూట్యూబ్ చానళ్లలో నారాయణరెడ్డి.. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, వారి సోదరుడు దుద్దిళ్ల శ్రీనుబాబుపై ఆధారం లేని అరోపణలు చేస్తూ వారి పరువుకు భంగం కలిగేలా కుట్ర పన్ని, శాంతిభద్రతలకు విఘాతం కలిగేలా, రెచ్చగొట్టేలా మాట్లాడాడని ఎస్సై పవన్‌కుమార్‌కు వివరించారు. నారాయణరెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కోట రాజబాబు, పీఏసీఎస్ చైర్మన్ చల్లా తిరుపతిరెడ్డి, మాజీవైర్మన్ వామన్‌రావు, మాజీ ఎంపీటీసీ సుధాకర్, సమ్మయ్య పాల్గొన్నారు.

కుట్రపై సమగ్ర విచారణ జరిపించాలి

పుట్ట మధు రాజకీయంగా ఎదుగుతున్న దశలో అతనిని హత్య చేసేందుకు కుట్ర పన్నిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఆయన సోదరుడు శ్రీనుబాబుపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం మంథనిలో బీఆర్ఎస్ నాయకులు తగరం శంకర్‌లాల్, ఎగోలపు శంకర్‌గౌడ్, కనవేన శ్రీనివాస్, అలుగువెల్లి వీరారెడ్డి, పోగుల సదానందం, బుద్ధార్థి రవి, కారెంగుల సుధాకర్, కమాన్‌పూర్ బీఆర్ఎస్ నాయకులు తాటి శంకర్, బొమ్మగాని అనీల్‌గౌడ్, పొన్నం రాజేశ్వరి, మేకల సంపత్‌యాదవ్‌తోపాటు పలువురు వేర్వేరుగా విలేకరుల సమావేశం నిర్వహించారు. ఇప్పుడు కూడా శ్రీధర్‌బాబు మంత్రి హోదాలోనే ఉండటం వల్ల పుట్ట మధుకు ప్రాణానికి హాని కలిగించే అవకాశం ఉన్నదని ఆందోళన వ్యక్తంచేశారు. మాజీ ఎమ్మెల్యేగా, జడ్పీ మాజీ చైర్మన్‌గా పనిచేసిన పుట్ట మధుకు గన్‌మెన్లను తొలగించడం ఆ కుట్రలో భాగమేనని ఆరోపించారు. పుట్ట మధుకు ప్రభుత్వం భద్రత కల్పించాలని, గన్‌మెన్లను నియమించాలని డిమాండ్ చేశారు. ఆయనకు ఎలాంటి హాని జరిగినా కాంగ్రెస్ ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు.

నారాయణరెడ్డి ఆరోపణలు అవాస్తవం

బీజేపీ నేత చల్లా నారాయణరెడ్డి మంత్రి శ్రీధర్‌బాబు, శ్రీనుబాబుపై చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని కాంగ్రెస్ నాయకులు ప్రసాద్, వొడ్నాల శ్రీనివాస్, శివ, సురేందర్‌రెడ్డి, ఉడుత పర్వతాల్‌యాదవ్, పేరవేన లింగయ్య పేర్కొన్నారు. శ్రీధర్‌బాబుపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు.



హైదరాబాద్ సీసీఎస్ ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు ఆశిష్‌కుమార్‌యాదవ్ తదితరులు

ఎంపీ చామలపై బీఆర్ఎస్ నాయకుల ఫిర్యాదు

ఆబిడ్స్, నవంబర్ 17: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌పై ఎక్స్ అకౌంట్‌లో తప్పుడు పోస్ట్‌లు చేస్తూ అసత్య ప్రచారాలు చేస్తూ పైశాచిక ఆనందం పొందుతున్న భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డిపై గోషామహల్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకుడు ఆశిష్ కుమార్ యాదవ్ హైదరాబాద్ సీసీఎస్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం ఆశిష్‌కుమార్ మాట్లాడుతూ కేటీఆర్‌ను సూటిగా ఎదుర్కొనే దమ్ములేక కక్ష కట్టి సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో గోషామహల్ నియోజకవర్గం గన్‌ఫౌండ్రి అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్, జాంబాగ్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, నాయకులు శైలేష్, ప్రదీప్‌రాజ్, అనిల్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.